


## కెజిబివిల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

**కలెక్టరేట్ :** జిల్లాలో గల 14 కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో 2024-24 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి, 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సమగ్రశిక్ష ఇన్‌ఛార్జి ఎపిసి ఎస్‌డివి రమణ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈనెల 21 నుంచి ఏప్రిల్ 20 వరకు ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నట్టు తెలిపారు. అనాథలు, డ్రాపౌట్స్ (బడి మానేసిన వారు) పేద, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ, బిపిఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను మాత్రమే అడ్మిషన్ కోసం పరిగణిస్తామని చెప్పారు. దరఖాస్తును 'హెచ్ టిటిపిఎస్://ఏపీకేజీబీవీ. ఏపీసీఎఫ్‌ఎస్‌ఎస్.ఐఎన్' సైట్ ద్వారా పొందవచ్చునన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందుతుందని తెలిపారు. సమాచారం అందిన వారు మాత్రమే ఆయా కెజిబివిలకు వెళ్లి చేరొచ్చుని, అదనపు సమాచారం కోసం కెజిబివి ప్రత్యేకాధికారులను సంప్రదించాలని సూచించారు.

# మన్యంలో మంటలు

**ఎస్‌టిలో బోయవాల్మీకులను చేర్చేందుకు అసెంబ్లీలో తీర్మానం**

**భగ్గుమంటున్న గిరిజన సంఘాలు**

ప్రజాశక్తి-సాలూరు/గుమ్మలక్ష్మీపురం


బిసిలుగా ఉన్న బోయవాల్మీకిలను ఎస్‌టిలో చేరుస్తూ అధికార వైసిపి ప్రభుత్వం తమ రాజకీయ స్వప్రయోజనం కోసం అసెంబ్లీలో తీర్మానం చేయడంతో మన్యం జిల్లాలో మంటలు రేపింది. శుక్రవారం అసెంబ్లీలో దీనిపై తీర్మానాన్ని శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించడమే కాకుండా కేంద్రానికి పంపనున్నట్లు తెలిపింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గిరిజన, ఆదివాసీ సంఘాలు ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ ప్రతిపాదన తెరపైకి వచ్చినప్పటి నుంచి గిరిజన ఆదివాసీ సంఘాలు గట్టిగా ప్రతిఘటిస్తున్నాయి. రాష్ట్రంలో 40లక్షలమంది వున్న బోయవాల్మీకిలను ఎస్‌టిల్లో చేరిస్తే ఇప్పటికే వున్న గిరిజన తెగలు తీవ్ర అన్యాయానికి గురవుతాయని సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మన్యంజిల్లాలో అసలైన గిరిజనులు 3.50లక్షల మంది ఉన్నారు. రాయలసీమలో ఇప్పటికే బిసిలుగా ఉన్న బోయ వాల్మీకులను ఎస్‌టిలో చేరిస్తే అసలైన గిరినులకు అన్యాయం జరుగనుంది.

దీనిపై తమ అసంతృప్తిని ఇప్పటికే పలు సందర్భాల్లో గిరిజన, ఆదివాసీ సంఘాలు, ఉపాధ్యాయ,ఉద్యోగ సంఘాల నాయకులు డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి రాజన్నదొరకు, సంబంధిత గిరిజన ఎమ్మెల్యేల దృష్టికి తీసుకు వెళ్లారు. అయితే గిరిజనులకు అన్యాయం జరుగుతున్నా పార్టీ నిర్ణయాన్ని వ్యతిరేకించలేని స్థితిలో అధికారపార్టీ ఎమ్మెల్యేలు, మంత్రి ఉన్నారు. వైసిపికి రాష్ట్రంలో ఏడుగురు గిరిజన ఎమ్మెల్యేలు వున్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో వారంతా తీవ్ర ప్రతిఘటన ఎదుర్కొనే పరిస్థితి కనిపిస్తోంది. ఇప్పటికే గిరిజన రిజర్వేషన్ పేరుతో నకిలీ గిరిజన నాయకులు కొంతమంది అధికార, ప్రతిపక్ష పార్టీలలో కీలకమైన పదవులు అనుభవిస్తున్నారు. దీనికి వ్యతిరేకంగా ఎపి గిరిజన సంఘం వంటి సంఘాలు పోరాడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం బోయవాల్మీకులను ఎస్‌టిలో చేరుస్తూ తీర్మానం చేయడం అగ్నికి ఆజ్యం పోసినట్లయ్యింది. తాజా ప్రభుత్వ నిర్ణయం అమలైతే ఎక్కువగా నష్టపోయేది పాడేరు, పార్వతీపురం మన్యం జిల్లా లకు చెందిన గిరిజనులేనని స్పష్టమవుతోంది.



ఆందోళన చేస్తున్న గిరిజనులు (ఫైల్)

### ఎస్‌టి జాబితాలో చేర్చడం తగదు



బోయ వాల్మీకులను గిరిజన జాబితాలో చేర్చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు రొబ్బా లోవరాజు అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో బోయ, వాల్మీకి కులస్తుల్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని ముఖ్యమంత్రి తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించడం దుర్మార్గమన్నారు. ఇదే జరిగితే రాష్ట్రంలోని సుమారుగా 32 లక్షల గిరిజనులకు ఎంతో నష్టమన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రంలో నకిలీ గిరిజనులు ఎక్కువైపోయి అర్హులైన గిరిజనులకు దక్కాల్సిన ప్రభుత్వ పథకాలు, రాజకీయ, ఉద్యోగ రిజర్వేషన్లు చెందకుండా చేస్తున్నారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో బోయ వాల్మీకి కులస్తులను ఎస్‌టి జాబితాలో చేరిస్తే నిజమైన ఆదివాసులు అభివృద్ధిలో వెనుకబడిపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. కావున ప్రభుత్వం పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు.

**అడకత్తెరలో అధికారపార్టీ ఎమ్మెల్యేలు**

రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని మన్యం జిల్లాల్లోని గిరిజనులంతా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. సిఎం జగన్ మోహన్ రెడ్డి నిర్ణయాన్ని ప్రతిఘటించలేక, స్థానిక గిరిజన సంఘాలను సముదాయించలేక వైసిపి ఎమ్మెల్యేలు అడకత్తెరలో పోకచెక్కల్లా నలిగిపోయే పరిస్థితి కనిపిస్తోంది. రాజ్యాంగం ప్రకారం గిరిజనులకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 6.5శాతం రిజర్వేషన్ అమలవుతోంది. ప్రభుత్వ తాజా నిర్ణయం అమలైతే రాజకీయాల్లో గాని, ఉద్యోగాల్లో గాని బోయవాల్మీకి కులస్తులే ఎక్కువ అవకాశాలు పొందే అవకాశం ఉంది. ఈనేపథ్యంలో తమ ఉనికినే ప్రశ్నార్థకం చేయనున్న తాజా నిర్ణయాన్ని వ్యతిరేకించాలని గిరిజన సంఘాలు అధికారపార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీపై ఒత్తిడి పెంచనున్నాయి.

### గిరిజనులకు తీవ్ర నష్టం



బోయవాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చుతామంటూ ముఖ్య మంత్రి జగన్మోహన్‌రెడ్డి చేసిన ప్రకటనతో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఎపి గిరిజన సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోలక అవినాష్ అన్నారు. గిరిజన సంక్షేమం, అభివృద్ధి కోసం కేటాయించబడిన చట్టాలు, హక్కులను పూర్తిగా అమలు చేయకపోవడంతో నేటికీ గిరిజనులు వెనుకబాటు జీవనం గడుపుతున్నారని అన్నారు. ఇటువంటి తరుణంలో రాజకీయ ప్రయోజనం కోసం బోయవాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చడానికి సిద్ధపడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు నూరు శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించే జిఒ 3ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

**26న గిరిజన సంఘాల జెఎసి ఏర్పాటు**

గిరిజనులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలతో పాటు బోయవాల్మీకిలను ఎస్టీల్లో చేరుస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయడంపై చర్చించేందుకు ఆదివారం పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో గిరిజన ఆదివాసీ సంఘాలు సమావేశం కానున్నాయి. సంఘాలన్నీ జెఎసిగా ఏర్పడి ప్రభుత్వ నిర్ణయాన్ని ఐక్యంగా వ్యతిరేకించాలని భావిస్తున్నాయి. దీని కోసం కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అధికారపార్టీ ఎమ్మెల్యే లు మంత్రులపై ఒత్తిడి పెంచేందుకు రంగం సిద్ధమవుతోంది.

# పిల్లలు, గర్భిణులు అంగన్వాడీ కేంద్రాల్లోనే తినాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

పిల్లలకు, గర్భిణీలకు సంపూర్ణ పోషణ కింద ఇస్తున్న పౌష్టికాహారం అంగన్వాడీ కేంద్రంలోనే తినాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ స్పష్టం చేశారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు అధికారులతో కలెక్టర్ శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో రక్త హీనతతో బాధపడుతున్న వారి సంఖ్య గణనీయంగా తగ్గాలని, అందుకు అంగన్వాడీ కేంద్రాలు ప్రధాన కేంద్రాలు కావాలని ఆయన స్పష్టం చేశారు. అంగన్వాడీ కేంద్రాల పరిధిలో రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణీలు, బాలింతలు, తక్కువ బరువు ఉన్న చిన్నారులను ఇప్పటికే గుర్తించామని, వారందరికీ కేంద్రంలోనే ప్రతి రోజూ పౌష్టికాహారం ఇచ్చి అక్కడే తినేలా చేయాలని ఆదేశించారు. తద్వారా రక్తహీనత తగ్గుతుందన్నారు. అంగన్వాడీ కేంద్రంలో హాజరై ఆహారం తీసుకున్న వారి హాజరు విధిగా వేయాలన్నారు. ఇందులో నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకుంటామని, అవసరమైతే సస్పెన్షన్ చేస్తామని హెచ్చరించారు. సీతంపేట, కురుపాం, భద్రగిరి, పార్వతీపురం ప్రాజెక్టుల పరిధిలో పిల్లలు, గర్భిణీల హాజరు తక్కువగా ఉందని దీనిపై దృష్టి సారించాలని ఆయన ఆదేశించారు.

**ఆర్‌సిహెచ్ ఐడి మ్యాప్ చేయాలి**

పునరుత్పత్తి, చిన్నారుల ఆరోగ్య గుర్తింపు (ఆర్.సి.హెచ్ ఐడి) కార్డు ఈ నెల 25 నాటికి మ్యాప్ చేయాలని కలెక్టర్ అన్నారు. ఒక్క కేసు కూడా పెండింగ్ ఉండరాదని స్పష్టం చేశారు. ఆరేళ్లలోపు పిల్లల ఆధార్ అప్ డేట్ చేయాలని ఆదేశించారు. ఆధార్ అప్ డేట్ ను శని వారం నాటికి పూర్తి చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఐసిడిఎస్ పిడి కె.విజయగౌరి తదితరులు పాల్గొన్నారు.





ఇళ్ల నిర్మాణాలపై సమీక్షిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

## మూడు వారాల్లో గృహ నిర్మాణాలు పూర్తి కావాలి

జిల్లాలో మూడు వారాల్లో నిర్దేశిత గృహ నిర్మాణాలు పూర్తి కావాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. జిల్లాలో గృహ నిర్మాణాలపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. జిల్లాలో ఇప్పటికే 8,916 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, మిగిలినవి పూర్తి కావడానికి బాధ్యత వహించాలని ఆదేశించారు. ఆర్‌సి స్థాయిలో ఉన్న గృహాలు, సొంత స్థలాల్లో నిర్మాణాలపై దృష్టి సారించాలన్నారు. నిర్మాణాలు చేసేందుకు రోజు వారి చేసే పనులు ముందుగా తయారు చేసి లబ్దిదారులను సమాయత్తం చేయాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు రుణాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని డిఆర్‌డిఎ, మెప్మా అధికారులను ఆదేశించారు. లే అవుట్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆయన ఆదేశించారు. నిర్మాణానికి, నివాసయోగ్యానికి అనుకూలంగా ఉండాలని స్పష్టం చేశారు. ఇప్పటికే విద్యుత్ స్తంభాలు వేసిన ప్రాంతాల్లో తక్షణం విద్యుత్ సరఫరా కల్పించాలని ఆయన ఆదేశించారు. లూరు నెలిపర్తి లే అవుట్‌లో తక్షణం స్తంభాలు వేయాలని, రోడ్లు వేయాలని ఆదేశించారు. ఇంజినీరింగ్ సహాయకులు తమ వద్ద గల గృహ నిర్మాణ జాబితాలో గృహాలను త్వరగా పూర్తి చేసేందుకు ప్రతి రోజూ పర్యవేక్షించాలన్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు సమర్పిస్తే మంజూరు చేస్తామని తెలిపారు. పాలకొండ, సాలూరు, పార్వతీపురం మునిసిపాలిటీ ప్రాంతాల్లో తాత్కాలికంగా నీటి కనెక్షన్లు ఇచ్చామని ప్రజా ఆరోగ్య శాఖ డిఇ కె.జి.ఎన్.నరసింగ రావు చెప్పారు. సమావేశంలో హౌసింగ్, డిఆర్‌డిఎ, డ్వామా పీడీలు పి.రఘురాం, పి.కిరణ్ కుమార్, కె.రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ ఓ.ప్రభాకరరావు, హౌసింగ్ ఇఇ రమేష్, మునిసిపల్ కమీషనర్లు జె.రామ అప్పల నాయుడు, హెచ్.శంకరరావు, ఎస్.సర్వేశ్వరరావు, ఇపిడిసిఎల్ ఇంజినీరింగ్ అధికారులు గోపాల కష్ణ, కె.వి.రత్నం తదితరులు పాల్గొన్నారు.

# 'గడపగడపకు..' పనులకు చెల్లింపులు

ప్రజాశక్తి - కలెక్టరేట్



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పూర్తి చేసిన పనులకు వెంటనే చెల్లింపులు జరుగుతున్నాయని జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజీ తెలిపారు. జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి కార్యాలయంలో శుక్ర వారం ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో గడప గడపకు మన ప్రభుత్వం పనుల వివరాలను తెలిపారు. జిల్లాలో 15 మండలాల్లో గడప గడపకు మన ప్రభుత్వం నిధుల నుండి గ్రామస్థాయిలో పనులు మంజూరు జరిగాయని చెప్పారు. ఇప్పటి వరకు జిల్లాలో 814 పనులు రూ.19.08 కోట్లతో పరిపాలన, సాంకేతిక పరమైన ఆమోదాలు పొందాయని చెప్పారు. 667 మంది కాంట్రాక్టర్లను నియమించామన్నారు. 814 పనుల్లో 30 పనులకు టెండర్లు పిలవడం పూర్తయ్యాయని, కొన్ని పనులను నామినేషన్ పద్ధతిలో అప్పగించడం జరిగిందని చెప్పారు. 89 పనులు ఇప్పటికే పూర్తయ్యాయన్నారు. బలిజిపేట మండలంలో రెండు రోడ్ల పనులకు రూ.36 లక్షలు చెల్లించామని, మిగతా పనులకు రూ.6.90 కోట్లు చొప్పున పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. సాంకేతిక సమస్యల వల్ల చెల్లింపుల్లో కొద్దిగా జాప్యం జరిగిందని, చేసిన పనులకు వెంటనే చెల్లింపులకు నిధులు సిద్ధంగా ఉన్నాయని ఆయన చెప్పారు. గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు తమ గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో సిమెంట్ రోడ్లు, కాలువలు, రహదారులు, వెంటనే పనులు పూర్తి చేయుటకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఆర్నెల్లు ఆలస్యంగా ఆసరా

- **మూడో విడతలో 16,436 సంఘాలకు రూ.94.18 కోట్లు**
- **నేడు సిఎం ప్రారంభం**
- **పది రోజులపాటు సంబరాలు**

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి




ఆరు నెలల ఆలస్యంగా అమలు చేస్తున్న వైఎస్ఆర్ 'ఆసరా'పై ప్రభుత్వం పది రోజులపాటు సంబరాలు జరపాలని నిర్ణయించింది. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా రూ.కోట్ల రూపాయలు ఖర్చుచేసేందుకు అవకాశం కల్పించింది. పది రోజులపాటు అధికారులు, ప్రజాప్రతినిధులకు ఇదే పని. ఈ మేరకు ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. 'ఇచ్చిందే ఆలస్యం, ఆపై హడావుడి' అంటూ స్వయం సహాయ సంఘాల సభ్యులు నివ్వెరబోతున్నారు. తాను అధికారంలోకి వస్తే డ్వాక్రా సంఘాల రుణాలను మాఫీ చేస్తానని ఎన్నికలకు ముందు చేసిన పాదయాత్రలో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. అధికారంలోకి వచ్చాక 2019 ఏప్రిల్ 11నాటికి ఎస్సీ, ఎస్టీ, బిసి సామాజికవర్గాలకు చెందిన స్వయం సహాయక సంఘాల సభ్యుల రుణ బకాయి నగదును నాలుగు విడతల్లో తిరిగి సభ్యుల ఖాతాల్లో జమచేస్తామని చెప్పారు. తీరా అమలుకు వచ్చేసరికి ఏడాది పట్టింది. వైఎస్ఆర్ ఆసరా పేరిట ఈ పథకాన్ని 2020 సెప్టెంబర్ 11న ప్రారంభించారు. ఆ ఏడాది ఉమ్మడి జిల్లాలో 36,434 స్వయం సహాయక సంఘాలకు రూ.250.54కోట్లు అందజేశారు. 2వ దశలో 2021 సెప్టెంబర్‌కు బదులు అక్టోబర్ 7న అట్టహాసంగా ప్రారంభించినప్పటికీ అర్హులందరికీ నగదు పడేసరికి ఆ నెలాఖరు అయ్యింది. విడతల వారీగా 36,475 స్వయం సహాయ సంఘాల సభ్యులకు 252.28కోట్లు అందింది. 3వ విడత 2022 సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో పార్వతీపురం మన్యం జిల్లాలో 16,436 స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.94.18కోట్లు అందజేయాల్సి వుంది. డిసెంబర్ వరకు ఉలుకూ పలుకూ లేకుండా పోయింది. చివరికి డిసెంబర్ చివరిలో 2023 జనవరిలో జమ చేస్తామని ప్రభుత్వం చెప్పింది. ఆ తరువాత ఉగాదికి తప్పకుండా ఖాతాల్లో జమ అవుతుందని చెప్పుకొచ్చారు. చిరికి నేడు (మార్చి 25న) ఏలూరు జిల్లా దెందులూరులో సిఎం జగన్మోహన్‌రెడ్డి అట్టాసంగా ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇలా ప్రారంభం కాగానే సభ్యుల ఖాతాల్లో నగదు జమ అయ్యేందుకు కూడా అవకాశం లేదు. దీనిపై సుమారు పది రోజుల పాటు మండలాల వారి వైఎస్ఆర్ ఆసరా వేడుకులు నిర్వహిస్తారు. ఇప్పటికే పంచాయతీ రాజ్, గ్రామీణాభివద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 26 నుండి ఏప్రిల్ 5 వరకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో స్థానిక ఎంపి, ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించనున్నారు. ఇందులో మండల, నియోజకవర్గ స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని కూడా సూచించినట్టు సమాచారం. రోజూ కొన్ని గ్రామ సమాఖ్యల పరిధిలో ఈ పంపిణీ కార్యక్రమం జరగనుంది. ఇప్పటికే ఈ రకమైన సమాచారం గ్రామ, వార్డు వాలంటీర్లు, గ్రామ సమాఖ్య సహాయకులు, పట్టణ రిసోర్సు పర్సన్లు లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి తెలియజేశారు. మార్చి 18 నుండి 20 వ తేదీ వరకు సెర్ప్ కమ్యూనిటీ కోఆర్డినేటర్లు ఆయా పొదుపు సంఘాల సభ్యులందరితో సమావేశాలు కూడా నిర్వహించారు మండలం లేదా నియోజవర్గాల వారీగా ఆసరా సంబరాలు పూర్తయితే తప్ప సభ్యుల ఖాతాల్లో జమ అయ్యే అవకాశం లేదు. దీంతో, అసలే ఆలస్యం, ఆపై హడావుడితో కాలక్షేపమా అంటూ పలువురు అసంతృప్తి, అసహనం వ్యక్తం చేస్తున్నారు.

# క్షయ పట్ల అప్రమత్తం : జెసి

ప్రజాశక్తి - కలెక్టరేట్

క్షయ (టిబి) మహమ్మారి పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని జాయింట్ కలెక్టర్ ఓ. ఆనంద్ అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక కలెక్టర్ కార్యాలయం నుండి ఎన్‌జిఒ హోం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌జిఒ హోంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జెసి మాట్లాడుతూ క్షయ అనేది గాలి ద్వారా వ్యాపించే ఒక అంటువ్యాధని, కోవిడ్‌తో పాటు క్షయ రోగం కూడా ఇబ్బంది కలిగించే సమస్య అని అన్నారు. ప్రస్తుతం దేశంలో కోవిడ్ కోవిడ్ కేసులు పెరుగుతున్నాయని, వీటితో పాటు క్షయ కేసులు ఇంకా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 2025 నాటికి టిబిని పూర్తిగా అంతం చేయాలని ఆరోగ్యశాఖ లక్ష్యంగా పెట్టుకుందని, క్షయ అనేది సాధారణంగా ఊపిరితిత్తులను ప్రభావితం చేసే ఒక వ్యాధని, కోవిడ్-19 తరహాలోనే ఒకరి నుంచి మరొకరికి సంక్రమించే అంటువ్యాధని వివరించారు. ఈ వ్యాధి సోకిన వ్యక్తి నుంచి గాలిలో విడుదలయ్యే తుంపర్ల ద్వారా ఇది ఎక్కువగా సంక్రమిస్తుందన్నారు. రోగి తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు లేదా కేవలం మాట్లాడినప్పుడు కూడా వారికి సమీపంలో ఉండే వేరే వ్యక్తికి సోకే ప్రమాదముందని తెలిపారు. ఇది మైక్రోబాక్టీరియం ట్యూబర్క్యులోసిస్ అనే బ్యాక్టీరియా వల్ల సంభవిస్తుందని, ఈ బ్యాక్టీరియా సాధారణంగా ఊపిరితిత్తులపై ప్రభావం చూపిస్తుందన్నారు. బ్యాక్టీరియా శరీరంలోని మూత్రపిండాలు, వెన్నెముక, మెదడు వంటి ఇతర భాగాలపైనా తీవ్రమైన ప్రభావం చూపుతుందని వివరించారు. వ్యాధిగ్రస్తుడు చికిత్స తీసుకోకపోతే మరణానికి కూడా దారితీయవచ్చని పేర్కొన్నారు. క్షయ వ్యాధి లక్షణాలతో బాధపడుతున్న వారు దగ్గర్లోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఉన్న సంబంధిత వైద్యులను సంప్రదించాలని సూచించారు. మందులతో పాటు రోగనిరోధక శక్తిని పెంచే పోషకాహారం తీసుకోవడం వల్ల మరింత వేగంగా ఈ వ్యాధి నుంచి కోలుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బగాది జగన్నాధం, జిల్లా క్షయ వ్యాధి నివారణాధికారి డాక్టర్ ఎ.శ్యామ్ కుమార్, ఐఎంఎ జిల్లా అధ్యక్షులు డాక్టర్ వై.వివేక్, వైస్ ఛాన్సలర్ డాక్టర్ శేషగిరిరావు, ఛాతీ వైద్యులు డాక్టర్ దుర్గాప్రసాద్, ధవళ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



టిబిపై అవగాహన కరపత్రాలను విడుదల చేస్తున్న జెసి ఆనంద్

**సీతానగరం :** మండలంలోని పెద అంకలాం, సీతానగరం పిహెచ్‌సి వైద్యాధికారులు కె.శిరీష, ఎం.రాధాకాంత్ ఆధ్వర్యంలో క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆహారపు అలవాట్లలో జాగ్రత్తలు పాటించాలని వారన్నారు. క్షయ వ్యాధిని నివారించేందుకు అందరు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇఒ జి.సూర్యనారాయణ హెచ్‌విలు వరలక్ష్మి, సత్యవతి, ఎఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.



సీతానగరంలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

## 8మంది విద్యార్థులు డిబార్

**విజయనగరం:** శుక్రవారం జరిగిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలో చూసి రాతలకు పాల్పడిన 8మందిని డిబారు చేసినట్లు ఆర్ఐఒ ఎం.సత్యనారాయణ తెలిపారు. గుర్ల, సీతానగరం, వేపాడలో ఇద్దరేసి చొప్పున, కొత్తవలసలో ఒకరు, విజయనగరంలో ఒక విద్యార్థిని డిబార్ చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 24795 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 23,779 మంది హాజరయ్యారు. 1016 మంది గైర్హాజరయ్యారు.

# కుక్కల దాడిలో 8 మేకలు మృతి

ప్రజాశక్తి-పాలకొండ

పట్టణంలో కొద్దిరోజులుగా కుక్కల బెడద ఎక్కువైంది. పలు వీధులతో పాటు ప్రధాన రహదారుల్లో కూడా కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. పట్టణంలో ఏలాం జంక్షన్‌లో గురువారం రాత్రి కుక్కలు 8 మేకలపై దాడి చేసి చంపేశాయి. దీంతో బాధితుడు జోగ జోలయ్య లబోదిబోమన్నాడు.

**నష్టానికి బాధ్యులెవరు....**

కుక్కలు దాడిలో 8 మేకలు మృతిచెందడంతో పెంపకం దారుడు తీవ్రంగా నష్టపోయాడు. ఇన్సూరెన్స్ సదుపాయం కూడా లేకపోవడంతో లక్షలాది రూపాయలు నష్టపోయినట్టు బాధితుడు చెబుతున్నాడు. దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నాడు.

**కుక్కలు నివారణకు చర్యలేవీ?**

కుక్కల నివారణకు నగర పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేయించాల్సి ఉన్నా అటువంటి చర్యలు తీసుకోలేదు. పట్టణంలో ఉన్న కుక్కలను దూర ప్రాంతాలకు తరలించాల్సి ఉన్నప్పటికీ అటువంటి చర్యలు కూడా చేపట్టలేదు. దీంతో పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

# అకాల వర్షం ... రైతులకు నష్టం



నడుకూరులో తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టిన రైతులు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలం లోని గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటలు దెబ్బతినడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెను గాలులకు మండలంలోని కిమ్మి, నడుకూరు, కంబర, చిట్టిపూడివలస, కంబర తదితర గ్రామాల్లో సుమారు వందెకరాలకు పైబడి అరటి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. అలాగే బిటివాడలో సుమారు 50 ఎకరాలకు పైబడి మొక్కజొన్న నేలకొరగడంతో రైతులు నష్టాలు చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో పాటు నాలుగు నెలల నుంచి ధాన్యం కొనుగోలు లేక పండిన పంటను దాచుకునేందుకు స్థలం లేక కళ్లాల్లోనే ఉంచి వేయడంతో అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోయాయి. నడుకూరుకు చెందిన వాన త్రినాధ, మంతిని పకీర్ నాయుడు, పిల్ల కేశవులకు చెందిన ధాన్యం వర్షాలకు తడిసి పావ్వడంతో అడుగుభాగానున్న ధాన్యాన్ని కళ్లాల్లో ఆరవేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుం దని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతు శ్రేయస్సు కోసం పనిచేస్తున్న ప్రభుత్వమని గొప్పలు చెబుతున్నారే తప్ప పంట కొనుగోలులో తీవ్ర జాప్యం చేస్తున్నట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆశించిన స్థాయిలో పంట దిగుబడి వచ్చినప్పటికీ అకాల వర్షం కారణంగా పంటలు దెబ్బ తినడంతో అప్పుల ఊబిలో కూరుకుపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

## చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా తరలిపోతున్నప్పటికీ సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారని మండల ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా జంఝావతి, నాగావళి నదుల పరీవాహక ప్రాంతాల నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కోటిపాం, గుమ్మడ గ్రామాల సరిహద్దుల్లో ఇసుక అక్రమ నిల్వలు చేసి ట్రాక్టర్లతో పార్వతీపురం పరిసర ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్నారు. దీంతో ఇసుక అక్రమ రవాణా మండలంలో జోరుగా రాత్రి, పగలు అన్న తేడా లేకుండా తరలిపోతుంది. రోడ్డుపై నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా జరుగుతున్నప్పటికీ సంబంధిత పోలీసు, రెవెన్యూ, పంచాయతీ అధికారులు పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు ముందు నుంచే ట్రాక్టర్లతో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా పట్టించుకోకపోవడంతో ఇదే తదునుగా పార్వతీపురం నుంచి కొన్ని ట్రాక్టర్లు ఇసుకను అక్రమంగా తరలించకపోతున్నాయి. మరో వైపు జంఝావతి నదిలోంచి ఇసుక తీసేందుకు ఎటువంటి అనుమతులు లేవు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ట్రాక్టర్ యాజమానులు నాటు బండ్ల రైతులతో కుమ్మక్కై, జంఝావతి నదిలో నుంచి ఇసుకను బండ్లతో ఒడ్డు పైకి పెరిగించి అక్కడ నుంచి ట్రాక్టర్లతో పార్వతీపురం, పరిసర గ్రామాలకు ఇసుకను అమ్మకాలు చేస్తున్నారు. ఈ ఇసుక ట్రాక్టర్లకు ఎటువంటి అనుమతుల ధ్రువపత్రాలు లేకపోవడంతో అధికారులు పట్టుకుంటే కేసులు పెట్టాల్సిన పరిస్థితి ఉంది. కానీ ఆ దిశగా అధికారులు పట్టించుకోకపోవడంతో మండలంలో రాత్రీ, పగలు అన్న తేడా లేకుండా ఇసుక అక్రమ రవాణా జరుగుతుంది. కొన్ని సందర్భాల్లో ఇసుక ట్రాక్టర్లతో అధికారులు, సిబ్బంది దృష్టిలో పడినప్పటికీ చూసీచూడనట్లు వ్యవహరించడంతో ఇసుక అక్రమ రవాణాదారులు పెచ్చు మీరుతున్నారని ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఇసుక అక్రమ రవాణాపై పోలీసు, రెవెన్యూ, పంచాయతీ అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ ఎటువంటి దాడులు నిర్వహించకపోవడం విడ్డూరంగా ఉందని మండల ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. ఇసుక అకమ రవాణాపై అధికారులు దృష్టి సారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.


ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ఇసుకలోడుతో కళ్లాంలో ఉన్న ట్రాక్టర్

## నేడు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్టు ఎంపిడిఒ ఎస్.రమేష్ తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.


సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ నూరల్ కమర్

## జంతువుల పట్ల క్రూరత్వం ప్రదర్శించొద్దు

ప్రజాశక్తి-పాలకొండ

జంతువుల పట్ల క్రూరత్వాన్ని ప్రదర్శించవద్దని సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. జంతువుల పట్ల క్రూరత్వ నిరోధక చట్టాన్ని సమర్ధవంతంగా అమలు చేయాలని, అందుకు కమిటీని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. సబ్ కలెక్టర్ అధ్యక్షతన పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జంతువుల పట్ల క్రూరత్వ నివారణపై శుక్రవారం స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ జంతువులను అక్రమ రవాణా చేయడం చట్టవిరుద్ధమన్నారు. మండలవారీగా ఎస్‌పిసిఎ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. జంతువులను చట్టవిరుద్ధం రవాణా చేయకూడదని, జంతువుల జనన రేటు వివరాలు నమోదు చేయాలని అన్నారు. ప్రతి ఒక్కరూ జంతువుల పట్ల స్నేహ భావం, మానవత్వం కలిగి ఉండాలని, జంతువులకు ఎలాంటి హాని కలిగించొద్దని ఆయన సూచించారు. సమావేశంలో డిఎస్‌పి జివి కృష్ణారావు, పశుసంరక్షణ అసిస్టెంట్ డైరెక్టర్ పి.మాణిక్యరావు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ బి. సిద్దార్థ, మున్సిపల్ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు, సిఐ కె.మురళీధరరావు, డిఎల్‌పిఒ జె.రామ ప్రసాదరావు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఏ.లావణ్య, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కె.కిరణ్‌చంద్ర, దేవాలయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్.రామారావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిసిసి డిఎం మహేంద్రకుమార్

## అటవీ ఉత్పత్తులపై అవగాహన కల్పించాలి

**గుమ్మలక్ష్మీపురం :** చింతపండు కొనుగోలుపై గిరిజనులకు అవగాహన కల్పించాలని డివిజనల్ మేనేజర్ మహేంద్ర కుమార్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం స్థానిక జిసిసి బ్రాంచ్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన సిబ్బందితో సమావేశమయ్యారు. ప్రభుత్వ నిర్ణయించిన ప్రకారం రూ.32. 40కు కిలో చింతపండును కొనుగోలు చేసి గిరిజనులు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా దోహదపడాలన్నారు. అలాగే గిరిజనులు పండించే అన్ని రకాల అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేసి జిసిసి ఆర్థికంగా మెరుగుపడేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో మేనేజర్ కృష్ణ ప్రసాద్, అకౌంటెంట్ గణపతి ఉన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న డిఎల్‌డిఒ గోపాలకృష్ణ

## సచివాలయ సిబ్బంది పనితీరుపై ఆగ్రహం

**పాలకొండ :** మండలంలోని బెజ్జిలో గల సచివాలయం పనితీరుపై డిఎల్‌డిఒ వివి గోపాలకృష్ణ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేయగా పంచాయతీ, డిజిటల్, పశుసంవర్ధకశాఖ కార్యదర్శులతో పాటు మరో కార్యదర్శి విధుల్లో ఉన్నారు. మిగిలిన వారంతా ఎక్కడున్నారని ప్రశ్నించగా ఇతరత్రా పనుల్లో ఉన్నారని చెప్పడంతో ఆయన అసహనం చెందారు. బాధ్యతగా విధులకు హాజరుకాకపోతే ఎలా అంటూ ప్రశ్నించారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని చెప్పారు. అలాగే పట్టణంలో కోటదుర్గ సచివాలయాన్ని సందర్శించి అక్కడ హాజరుపట్టీని, మూమెంట్ రిజిస్టర్‌ను పరిశీలించారు. అక్కడ సిబ్బంది పనితీరు పట్ల సంతృప్తి చెందారు. సచివాలయ సేవలు మరింత మెరుగుపడాలని సూచించారు.


బీమా చెక్కును అందజేస్తున్న సర్పంచ్ సురేష్, వైసిపి నాయకులు

## వైఎస్ఆర్ బీమా సాయం అందజేత

**కురుపాం :** మండలంలోని గుమ్మడిగూడ గ్రామానికి చెందిన తాడంగి మోహనరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా నామినీగా ఉన్న ఆయన కుమార్తె స్వప్నకు తక్షణ సహాయం కింద రూ.10వేలు శుక్రవారం తన ఇంటి వద్దకు సర్పంచ్ శెట్టి సురేష్‌కుమార్, వైసిపి జిల్లా గ్రీవెన్స్ విభాగ అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిగతా లక్ష రూపాయలు బీమా సొమ్ము కూడా త్వరలో వచ్చేలా ఏర్పాటు చేస్తామని బాధ్యత కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.రామచంద్ర, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధి పనుల పరిశీలన

**పాలకొండ రూరల్ :** మండలంలో తుమరాడ చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం ఎంపిడిఒ డొంక త్రినాధులు పరిశీలించారు. పనులు వేగవంతంగా చేయాలన్నారు. సక్రమంగా పనిచేసి వేతనాలు తీసుకోవాలన్నారు. ఎటువంటి ఇబ్బందులున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు.


విద్యార్థినులతో మాట్లాడుతున్న జిల్లా సమన్వయకర్త చంద్రావతి

## మంచి మార్కుల సాధనకు శ్రద్ధగా చదవాలి

**భామిని :** విద్యార్థులు మంచి మార్కులు సాధించేందుకు శ్రద్ధగా ప్రణాళికా బద్ధంగా చదవాలని గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయకర్త బి.చంద్రావతి తెలిపారు. శుక్రవారం ఆమె స్థానిక బిఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలను పరిశీలించారు. పరీక్షలు ఎలా రాస్తున్నారని ఇంటర్ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ప్రస్తుత సమయం చాలా విలువైనదని, ప్రణాళికా బద్ధంగా పునఃశ్చరణ చేస్తే మంచి మార్కులు సాధించవచ్చని ఇంటర్, టెన్త్ విద్యార్థులకు ఆమె సూచించారు. అనంతరం విద్యార్థినిలతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ విజయనిర్మల, వైస్ ప్రిన్సిపల్ సిహెచ్ రంగారావు, స్కూల్ చైర్మన్ వెంకటరమణ, వైస్ చైర్మన్ తేజేశ్వరరావు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనం పరిశీలన

**కురుపాం :** మండలంలోని నీలకంఠాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని శుక్రవారం సర్పంచ్ ఎ.మన్మధరావు, వైస్ ఎంపిపి బి.అన్నాజీరావు పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి ప్రతిరోజూ నాణ్యమైన భోజనం అందుతుందా? లేదని అడిగి తెలుసుకొని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ రుచికరమైన భోజనం అందజేయడంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.

## తాగునీరు సరఫరా

### 'ప్రజాశక్తి' కథనానికి స్పందన

**వీరఘట్టం :** మండలంలోని వండువ ఉపరితల రక్షిత మంచినీటి పథకం నుంచి శుక్రవారం తాగునీరు సరఫరా చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈనెల 20న తాగునీటి సరఫరాకు బ్రేకులు అన్న 'ప్రజాశక్తి' కథనానికి ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు స్పందించి గ్రామీణ ప్రాంతాల ప్రజలకు తాగునీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నారు.

## సర్వే వేగవంతం చేయాలి

**సీతంపేట:** మండలంలో ఎస్‌డిజి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సర్వే వేగవంతం చేస్తున్నట్టు ఎంపిడిఒ కె.గీతాంజలి తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కలెక్టర్‌తో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎంపిడిఒ, వెల్ఫేర్ అసిస్టెంట్లు సమావేశమయ్యారు. ఎంపిడిఒ మాట్లాడుతూ ఇప్పటికే 45 రోజులు కావస్తున్నా 68 శాతం సర్వే అయిందని మరో వారం రోజుల్లో సర్వే పూర్తి కావాలని అన్నారు. అలాగే గర్భిణీలు, ఐదేళ్లలోపు పిల్లలు, ఆరు నుంచి 19 ఏళ్ల ఆడపిల్లలపై సర్వే వేగవంతం చేయాలన్నారు. వాలంటీర్లు, మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఎఎన్ఎం ఐక్యంతో సర్వే చేయాలన్నారు. అలాగే వెల్ఫేర్ అసిస్టెంట్లు ప్రతివారం సంబంధిత పాఠశాలలను తనిఖీ చేయాలన్నారు. చైల్డ్ ఆధార్ సీడింగ్ తప్పనిసరిగా చేయాలన్నారు


వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎంపిడిఒ, సచివాలయ సిబ్బంది

## 9 మంది గైర్హాజరు

**వీరఘట్టం :** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలకు శుక్రవారం 9 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు సిఎస్ పి.శంకర్రావు శుక్రవారం తెలిపారు. 228 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉన్నప్పటికీ 9మంది పరీక్షకు హాజరు కాలేదని తెలిపారు.

## ప్రజల చెంతకు ఆరోగ్య కార్యక్రమాలు

**పార్వతీపురం,:** ఆరోగ్య కార్యక్రమాలు ప్రజల చెంతకు చేరాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు అన్నారు. ఆరోగ్య కార్యక్రమాలు, సంబంధిత యాప్‌లపై వైద్యాధికారులకు శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం జిల్లా ఆసుపత్రి సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాన్ని , సంబంధిత వైద్య సేవలు పూర్తి స్థాయిలో ప్రజలకు అందాలని అన్నారు. అందుకు శిక్షణా కార్యక్రమం ఎంతగానో దోహద పడుతుందని చెప్పారు. గర్భిణీలకు అవసరమైన అన్ని రకాల పరీక్షలు తప్పనసరని, క్రమం తప్పకుండా ఆసుపత్రిలో ఆరోగ్య తనిఖీలు చేపట్టాలని లు నిర్వహణ, డ్రై డే కార్యక్రమాల నిర్వహణ వాటిని అప్లోడ్ చేయడం, టి బి , లెప్రసీ సర్వే, ఫ్యామిలీ ప్లానింగ్ శస్త్ర చికిత్సల నిర్వహణ మొదలకు కార్యక్రమాలను అమలు చేయడం , వాటిని అప్లోడ్ చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన స్పష్టం కారక్రమంలో జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.వాగ్దేవి, ఆర్ బి ఎస్ కె ప్రోగ్రాం అధికారి డాక్టర్ ధవళ భాస్కరరావు , డిఐఒ టి.జగన్మోహనరావు, డిటిసిఒ శ్యామ్ కుమార్, ఎపిడిమియాలజిస్ట్ నవీన్ కుమార్ , ఎఫ్ పి సి ప్రోగ్రాం అధికారి వినోద్ కుమార్ , ప్రోగ్రాం అధికారి విజయ్ మోహన్ , సిబ్బంది పాల్గొన్నారు.

# 'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కొమరాడ

ఏప్రిల్ 5న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని దేవుకోన పంచాయతీ పూర్ణపాడు, బంగారంపేట, కోమట్ల పేటలో శుక్రవారం కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. అనంతరం సాంబమూర్తి, ప్రజాసంఘాల నాయకులు ఎ.ఉపేంద్ర, లక్ష్మయ్య యామక గౌరు నాయుడు మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరునకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమంలో కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, వివిధ వర్గాలకు చెందిన కార్మికులంతా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రసాదు, రాము, వెంకటేష్, లక్ష్మణరావు, గంగారాజు పాల్గొన్నారు.

**గుమ్మలక్ష్మీపురం :** కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న చేపట్టిన చలో ఢిలీకి రైతులు, కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఎపి గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కోలక అవినాష్ కోరారు. గుమ్మలక్ష్మీపురంలో కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ, పారిశుధ్య, కార్మికులు మండంగి పైడయ్య, కె.త్రినాధ్, భూషణ, సురేష్ తదితరులు ఉన్నారు.

**కురుపాం :** ఏప్రిల్ 5న జరగబోయే చలో ఢిల్లీ కార్యక్రమం జయప్రదం చేయాలని గరుగుబిల్లి మండలం సుంకిలో వ్యవసాయ కార్మిక, రైతు సంఘాల నాయుకులు కొల్లి గంగు నాయుడు, కరణం రవీంద్ర ఉపాధి పనులు వద్ద ప్రచారం చేశారు. కేంద్రప్రభుత్వ ఉపాధిహామీ చట్టాన్ని ఎత్తివేయడానికి ప్రయత్నిస్తుందని, లేబర్ కోడ్‌లు తెచ్చి కార్మిక హక్కులు కాలరాస్తుందని, ఈ విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమంలో అందరు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.


జియ్యమ్మవలస : కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ, రైతు సంఘాల నాయకులు

కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

**సాలూరురూరల్** : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమం జయప్రదం చేయాలని ప్రజా సంఘాల నాయకులు మర్రి శ్రీనివాస రావు , ఎన్‌వై నాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని దేవుబుచ్చింపేటలో ఉపాధిహామీ వేతనదారులతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఎం.నాగేశ్వరరావు, చీకటి వెంకటరమణ, రైతు సంఘం నాయకులు కోరుకొండ సూర్యనారాయణ, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

**పాలకొండ రూరల్:** స్కీమ్ వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఏప్రిల్ 5న జరగనున్న చలో ఢిల్లీను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు పిలుపునిచ్చారు. ఆశా కార్యకర్తలతో జరిగిన సమవేశంలో చలో ఢిల్లీను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# టిడిపిదే భవిష్యత్తు : కిశోర్ చంద్రదేవ్

ప్రజాశక్తి - కురుపాం

టిడిపి తరఫున పోటీ చేసిన పట్టభద్రుల ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యే కోట ఎమ్మెల్సీ గెలుపుతో రానున్న రోజుల్లో టిడిపికే భవిష్యత్తు ఉందని ప్రజలు చెప్పగానే చెబుతున్నారని కేంద్ర మాజీ మంత్రి వైరిచర్ల కిషోర్ చంద్ర సూర్యనారాయణ దేవ్ అన్నారు. ఎమ్మెల్సీగా పి.అనురాధ గెలుపు సందర్భంగా శుక్రవారం కురుపాం కోట వద్ద నియోజకవర్గ ఇన్చార్జి టి.జగదీశ్వరి ఏర్పాటు చేసిన కేక్ కటింగ్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రులు ప్రభుత్వ పరిపాలనపై విసుగు చెంది సమగ్రమైన పరిపాలన అందించే నాయకుడు చంద్రబాబునని గుర్తించారని, వైసిపి ఎమ్మెల్యేలు కూడా పరిపాలన విసిగించింది టిడిపి అభ్యర్థికి ఓటేశారని అన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్లు కెవి కొండయ్య, పల్లా రాంబాబు, అక్కినేని మధు, శేఖర్ పాత్రుడు, అరుకు పార్లమెంట్ బీసీ సెల్ అధ్యక్షులు డొంకాడ రామకష్ణ, టిడిపి సీనియర్ నాయకులు నందివాడ కష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

**జియమ్మ వలస :** ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి ఒక స్థానాన్ని కైవసం చేసుకోవడం పట్ల చినమేరంగిలో శత్రుచర్ల విజయరామరాజు నివాసంలో విజయయోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా శత్రుచర్ల మాట్లాడుతూ ఎమ్మెల్సీ గెలుపు టిడిపి పార్టీకి భవిష్యత్తుకు నాంది అని


కిశోర్‌కు కేక్ తినిపిస్తున్న జగదీశ్వరి

అన్నారు. ఎమ్మెల్సీ గెలవడం రాష్ట్ర టిడిపి శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపుతుందని అన్నారు. కార్యక్రమంలో కురుపాం టిడిపి ఇన్చార్జ్ తోయక జగదీశ్వరి, అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, దేవ కోట వెంకట నాయుడు, పల్ల రాంబాబు, ఎ.వెంకట నాయుడు, జోగి భుజంగరావు, ఎన్ మధుసూధనరావు తదితరులు పాల్గొన్నారు.

**పాలకొండ :** రాబోయే శాసనసభ ఎన్నికలో టిడిపి గెలుపునకు ఎంఎల్‌సి ఎన్నికలే శుభసూచకమని ఆపార్టీ పాలకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ అన్నారు. ఎంఎల్ఎ కోటాలో ఎంఎల్‌సి ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి అనురాధ గెలుపొందడంతో స్థానిక టిడిపి కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, మండల, పట్టణ అధ్యక్షులు గండి రామినాయుడు, గంటా సంతోష్‌కుమార్, వెన్నపు శ్రీనివాసరావు తదితరులున్నారు.

**గుమ్మలక్ష్మీపురం :** టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పంచుమర్తి అనురాధ విజయం సాధించిన సందర్భంగా గరుగుబిల్లి మండలం ఖడ్గవలస కూడలి వద్ద టిడిపి మండల అధ్యక్షులు అక్కేన మధుసూదనరావు, అరకు పార్లమెంటు జిల్లా బిసి సెల్ ఉపాధ్యక్షులు అంబటి రాంబాబు ఆధ్వర్యంలో శుక్రవారం సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు మరడాన సింహాచలంనాయుడు, యామల శ్రీనివాసరావు, నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు గంగాధరనాయుడు, యువత అధ్యక్షులు జగదీష్ మరడాన కృష్ణంనాయుడు ఉన్నారు.

**వీరఘట్టం** ఎమ్మెల్సీ ఎన్నికల్లో పంచుమర్తి అనురాధ విజయం సాధించడం పట్ల మండల కేంద్రంలో నియోజకవర్గ ఇన్చార్జ్ నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. సైకో ప్రభుత్వం పోవాలని సైకిల్ ప్రభుత్వం రావాలని, ఇందుకు కార్యకర్తలు, సైనికుల పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఉదయాన ఉదయభాస్కర్, పట్టణ అధ్యక్షులు జామి లక్ష్మీ నారాయణ, పొదిలాపు కృష్ణమూర్తి నాయుడు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు పి.వెంకటరమణ, బి.హరిబాబు, ఎం.అనిల్‌కుమార్, ఎన్.శశికుమార్, ఉమామహేశ్వరరావు, బి నీలకంఠంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## గుమ్మలక్ష్మీపురంలో భారీ వర్షం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఉరుములు మెరుపులతో సుమారు గంటపాటు కురుస్తున్న వర్షంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ వర్షానికి ప్రధాన రహదారులు జలమయం అయ్యాయి. వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలకు వర్షం ఎంత ఉపశమనం కలిగించింది. మరోవైపు ఈ వర్షం పోడు పంటలకు అనుకూలంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు.

## ఎన్ఎంఎంఎస్‌కు ఇద్దరు ఎంపిక

ప్రజాశక్తి - మక్కువ

జాతీయ స్థాయి మెరిట్ స్కాలర్‌షిప్ కోసం ఇటీవల జరిగిన పరీక్షల్లో ములక్కాయ వలస మోడల్ పాఠశాల విద్యార్థులు ఇద్దరు ఎంపికయ్యారు. శుక్రవారం విడుదలైన ఫలితాల్లో కె.ప్రశాంత్ కుమార్‌కు జిల్లాలో నాలుగో స్థానం పొందారు. అలాగే జె.జ్యోతి కూడా అర్హత సాధించారు. జాతీయస్థాయి మెరిట్ స్కాలర్‌షిప్‌కు విద్యార్థులు ఎంపికవ్వడం పట్ల ప్రిన్సిపల్ స్వర్ణలత, ఇతర సిబ్బంది అభినందించారు.

# నీటి వినియోగదారులకు అవగాహన

ప్రజాశక్తి - సాలూరు

ఎపి నీటి పారుదల పథకం, జీవనోపాదుల పథకం (జైకా) సహకారంతో శుక్రవారం మండలంలోని జీగిరాంలో నీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన ఆయకట్టు దారులు, నీటి వినియోగదారుల సదస్సు జరిగింది. ఎపి ఐఎల్ఐపి -2 సూక్ష్మ ప్రణాళికపై చర్చ జరిగింది. కార్యక్రమంలో నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పి.వేణుగోపాలరావు మాట్లాడుతూ రూ.30.65 కోట్లతో పెద్దగెడ్డ ఆధునీకరణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. రైతులు, ఆయకట్టుదారులు సమస్యలు తెలియజేయాలని కోరారు. పెద్దగెడ్డ జెఇ సంధ్య మాట్లాడుతూ పెద్దగెడ్డ రిజర్వాయర్ ఆధునీకరణ పనుల్లో భాగంగా రెండు కాలువల కాంక్రీటు పనులు ఖరీఫ్ సీజన్ వరకు జరుగుతాయని చెప్పారు. వచ్చే ఖరీఫ్ సీజన్ నుంచి నీరు విడుదల చేయనున్నట్లు చెప్పారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎ.సుభాషిణి, ఎంపిటిసి సభ్యులు సూరప్పలనాయుడు, జెజెఎం టీం లీడర్ మోహన్ రావు పాల్గొన్నారు.

**పాచిపెంట :** రైతులకు సాగునీరందించడంపై ప్రణాళిక తయారు చేస్తామని నీడ్ స్వచ్ఛంద సంస్థ ఇడి వేణుగోపాలరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని విశ్వనాథపురంలో ఆయకట్టుదారులతో సాగునీరందించేలా సూక్ష్మప్రణాళిక తయారు కోసం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మండలంలోని ప్రతి గ్రామంలో పర్యటించి అవసరమైన చోట సాగునీటి సరఫరాకు ప్రణాళిక తయారు చేసి అభివృద్ధి పనులు చేపడతామన్నారు. పెద్దగెడ్డ ప్రాజెక్టు ద్వారా ఆధునీకరణ పనులు చేపట్టి ప్రతి చివర భూములకు సాగునీరందించేలా అధికారులతో చర్చిస్తామన్నారు. సమావేశంలో వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసరావు, ఎఒ కె.తిరుపతిరావు, సచివాల సిబ్బంది, నీడ్ బృందం సభ్యులు పాల్గొన్నారు.


కొమరాడ : సమావేశంలో మాట్లాడుతున్న మండల ఇంజినీర్ ఫనీష్

## త్వరితగతిన పనులు చేపట్టాలి

ప్రజాశక్తి - కురుపాం

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నిర్దేశించిన పనులను త్వరితగతిగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఇఇ ఎస్.రాధారాణి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎఇ పి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈనెలాఖరుతో ఆర్థిక సంవత్సరం పూర్తవు తున్న సందర్భంగా పనులు పూర్తి చేయడమే కాకుండా బిల్లులు అప్లోడ్ కూడా చేయాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

**కొమరాడ :** గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన పనులను వేగవంతం చేయాలని మండల ఇంజనీరింగ్ అధికారి ఫనిష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు సర్పంచులు ఇంజనీరింగ్ సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో ఇప్పటి వరకు 7 గ్రామ సచివాలయ పరిధిలో 57 పనులను గుర్తించామన్నారు. ఈ పనులకు రూ.కోటీ 7వేలు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రజా ప్రతినిధుల సమన్వయంతో చేసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపిడిఒ ఎల్‌వి అప్పారావు, వైసిపి నాయకులు మధుసూదనరావు, మండల కన్వీనర్ ద్వారపూడి జనార్ధన్, సర్పంచుల ప్రజాప్రతినిధులు, ఇంజనీరింగ్ సహాయకులు ఉన్నారు.

# ఆదివాసీలను గెంటేసే యత్నాలు మానుకోవాలి

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

అనకాపల్లి జిల్లా, కొత్త వీధి రెవెన్యూ పరిధిలో లేదని చెప్పి ఆదివాసీలను గెంటేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, దీన్నితీవ్రంగా ఖండిస్తున్నట్టు సిపిఐ( ఎం.ఎల్) లిబరేషన్ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సంగం అన్నారు. ఈ మేరకు ఆ గ్రామ ప్రజలకు మద్దతుగా శుక్రవారం పట్టణ శివారులో గల నవిరి కాలనీలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా చీడికాడ మండలం కోణం రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 289లో భూమిని దశాబ్దాలుగా ఆదివాసీలు సాగు చేసుకుంటూ అదే భూమిలో కొత్తవీధి అనే గ్రామాన్ని కూడా కట్టుకొని జీవిస్తున్నారని, ఈ క్రమంలో అక్కడ ఆదివాసీల భూములను రికార్డుల్లో తొలగించి, ఆ గ్రామమే లేకుండా చేసి, వారి భూమిని లాక్కొనేందుకు కబ్జాదారులు రెవెన్యూ అధికారుల సహాయంతో ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. దీనిపై ఆ గ్రామ ప్రజలకు మద్దతుగా ఉద్యమాలు చేస్తున్నాయని తెలిపారు. ఈ మేరకు నిరసన చేపట్టడం జరిగిందని వివరించారు. గిరిజన, హరిజన, బడుగు, బలహీన వర్గాల హక్కులను కాలరాస్తే తాము చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఎ.దామోదర్, ఆర్.గౌరునాయుడు, టి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

## సర్వే పరిశీలన

**సీతానగరం :** మండలంలోని బగ్గందొరవలసలో శుక్రవారం స్వమిత్ర గ్రామకంఠం-6 సర్వేను మండల పంచాయతీ విస్తరణ అధికారి కెకె వర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఉండే ప్రభుత్వ భూమి అని నిర్ధారించామని అన్నారు. అలాగే గ్రామంలో ఇంటి పన్ను బకాయిలను వసూలు చేయాలని అన్నారు. తాగునీరు, కాలువలు, వీధి దీపాలు పరిష్కరించే దిశగా చూడాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## చురుగ్గా విద్యుత్తు మరమ్మతులు

### 'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలోని శోభలతాదేవి కాలనీలో విద్యుత్ స్తంభాల నుంచి నేలకు వేలాడుతున్న విద్యుత్‌తీగెలను సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. ప్రజాశక్తిలో ఇటీవల ప్రచురితమైన వేలాడుతున్న విద్యుత్ తీగలు... భయంగుప్పెల్లో ప్రజలు అన్న వార్తకు అధికారులు స్పందించారు. దీంతో శుక్రవారం ఆశాఖ సిబ్బంది విద్యుత్ తీగలను, స్తంభాలను మార్చారు. దీంతో ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## షాపుల అద్దెకు దరఖాస్తుల స్వీకరణ

**సీతంపేట** స్థానిక సామాజిక కమ్యూనిటీ భవనం ఎదురుగా మెయిన్ రోడ్‌లో ఐటిడిఎ నిర్మించిన షాపులను అద్దెకు ఇవ్వనున్నట్టు పిఒ బి.నవ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ.3లక్షలు గుడ్‌విల్ ఇస్తూ నెలసరి అద్దె చెల్లించాలని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఏప్రిల్ 1లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9392917692 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## 25న వాహనాల వేలం

**వీరఘట్టం :** స్థానిక పోలీస్ స్టేషనులో ఈనెల 25న సారాతో పట్టుబడిన 5వాహనాలకు వేలంపాట వేయనున్నట్లు ఇన్చార్జి ఎస్ఐ కిషోర్ వర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డిఎస్‌పి ఆధ్వర్యంలో ఈ వేలంపాట వేయనున్నారు.